క్లుప్తంగా

మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న ఆనందరెడ్డి, దుర్గారెడ్డి

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలో గురువారం సుమారు వెయ్యి మామిడి, గులాబీ మొక్కలను పంపిణీ చేశారు. కొంకుదురుకు చెందిన సబ్బెళ్ల ఆనందరెడ్డి, జొన్నడకు చెందిన నల్లమిల్లి దుర్గారెడ్డి సంయుక్తంగా గ్రామానికి చెందిన ఉప సర్పంచి సత్తి తాతారెడ్డి జ్ఞాపకార్థంగా వీటిని అందజేశారు. మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణ చేయాలని కోరారు. దీనివల్ల భవిష్యత్తు తరాలకు ఆక్సిజన్ అందుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సత్తెమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో సత్తెమ్మ తల్లి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో సత్తెమ్మ తల్లి ఆలయం వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ట్రాక్టర్ డ్రైవర్లు, ట్రాక్టర్ యాజమానులు, రైతుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన చేశారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజానగరం: వెలుగుబంద విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్‌పై వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నటరాజన్ తెలిపారు. ఆ సమయంలో వెలుగుబంద, జేహెచ్‌సీ కాలనీలకు సరఫరా ఉండదన్నారు.

అదనంగా 19 పోలింగ్ బూత్‌లు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో ప్రేమ్‌కుమార్

అనపర్తి: నియోజకవర్గంలో అదనంగా మరో 19 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయనున్నట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ (ఆర్వో) అధికారి రాజా రమేష్ ప్రేమ్ కుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ నియోజకవర్గంలో 228 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, 1200 ఓట్లకన్నా ఎక్కువగా ఉన్నచోట అదనంగా 19 బూత్‌లు కేటాయించామన్నారు. ఓటర్ల జాబితాలో చిరునామా మార్పులు, మృతి చెందిన వారి వివరాలు సవరించాలని అన్ని పార్టీల నాయకులు ఆర్వోకు సూచించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రామారెడ్డి, అనపర్తి మండల టీడీపీ అధ్యక్షుడు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, బీజేపీ నేత సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ నేత బులిస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తిరువీధి ఉత్సవం



గరుడ వాహన సేవలో పాల్గొన్న భక్తులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): శ్రీపద్మావతి, గోదాదేవీ సమేత వేంకటేశ్వరస్వామివారి గోవింద క్షేత్రంలో జరుగుతున్న 15వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం తిరువీధి ఉత్సవం, గరుడ వాహనసేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీలక్ష్మీహయగ్రీవయిష్టి, సీతారామచంద్రమూర్తికి క్షీరాదివాసం, పూర్ణాహుతి, తీర్థగోష్ఠి జరిపారు. సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణ, అనంతరం శ్రీవారి తిరువీధి ఉత్సవం, గరుడ వాహన సేవ, సీతారామచంద్రమూర్తికి పంచశయ్యాదివాసం నిర్వహించారు. భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

వైభవంగా ప్రసన్నాంజనేయ స్వామి పల్లకీ సేవ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని పల్లకీలో డప్పు వాయిద్యాలతో పురవీధులలో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట నృత్యం అలరించింది. కార్యక్రమంలో భక్తులు, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్హులకు అందేనా!

- సబ్సిడీ రుణాలపై గందరగోళం
- యూనిట్లు తక్కువ, దరఖాస్తులు ఎక్కువ
- తమ వారికే లబ్ధి చేకూర్చేందుకు కూటమి నాయకుల యత్నం



బిక్కవోలులో రుణాల ఇంటర్వ్యూకు హాజరైన దరఖాస్తుదారుడు (ఫైల్)

బిక్కవోలు: చేతిలో విద్యార్హతలు ఉన్నాయి. వ్యాపార అనుభవం ఉంది. చిన్నపాటి పరిశ్రమ పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకోవచ్చునే ఆలోచన ఉంది. కావాల్సినదంతా పెట్టుబడి. ఈ దశలో ప్రభుత్వం బీసీలతో పాటు ఈడబ్ల్యూసీ, కాపులు ఆయా కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రకటించింది. బ్యాంకులు పెట్టుబడికి అప్పులు ఇస్తాయి. ప్రభుత్వం కొంత సబ్సిడీ ఇస్తుంది. రుణం మంజూరైతే స్వగ్రామంలోని ఉపాధి కలుగుతుందనే ఆశతో చాలామంది దరఖాస్తు చేశారు. కానీ యూనిట్లు తక్కువ, దరఖాస్తులు ఎక్కువగా రావడంతో నిరాశ పడుతున్నారు. కొందరు దరఖాస్తుదారులు.. సిఫారసుల కోసం కూటమి నాయకుల చుట్టూ తిరుగుతున్నారు.

ఆశలకు గండి

సబ్సిడీ రుణాల ఆశావహులకు మొదట్లోనే ప్రభుత్వం గండి కొట్టింది. మండలానికి చాలా తక్కువ యూనిట్లు మంజూరు చేసింది. కానీ వాటికి దరఖాస్తులు అధికంగా వచ్చాయి. ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. నియోజకవర్గంలో బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 376 యూనిట్లు మంజూరు కాగా, వాటికి 2,461 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో బీసీ యూనిట్లు 181కి 1,775 దరఖాస్తులు, కాపు యూనిట్లు 89కి 385 దరఖాస్తులు, ఈడబ్ల్యూఎస్ 53 యూనిట్లకు 301 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

రాజకీయ జోక్యం

సబ్సిడీ రుణాలపై రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోయింది. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీల పెత్తనం సాగింది. వారు ఎవరి పేరు చెబితే వారికే సబ్సిడీ రుణాలు ఇచ్చారు. ఇప్పుడు ఆ కమిటీలు లేకపోయినా గ్రామాల్లో కూటమి వ్యవహారాలు చూస్తున్న నాయకులు అర్హుల జాబితాలను తయారు చేస్తున్నట్లు సమాచారం. ఈ జాబితాలను అధికారులకు ఎమ్మెల్యే పంపుతున్నారని తెలుస్తోంది. దీంతో దరఖాస్తుదారుల్లో నిరాశ అలముకుంది. అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేదు. ఈ దశలో సబ్సిడీ రుణాలైనా అర్హులకు అందుతాయనే ఆశ పడగా, వాటిపై కూటమి నాయకులు నీళ్ల చల్లుతున్నారని దరఖాస్తుదారులు ఆవేదన చెందుతున్నారు. ఇదే అవకాశంగా కూటమి పార్టీల సానుభూతిపరులు, గతంలో సబ్సిడీ రుణాలు పొందిన వారు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో అన్ని అర్హతలున్న వారు ఆందోళన చెందుతున్నారు.

అనపర్తి నియోజకవర్గం

మండలం	విభాగం	యూనిట్లు	దరఖాస్తులు
అనపర్తి	బీసీ	33	293
అనపర్తి	కాపు	7	52
అనపర్తి	ఈడబ్ల్యూఎస్	22	163
బిక్కవోలు	బీసీ	62	480
బిక్కవోలు	కాపు	17	111
బిక్కవోలు	ఈడబ్ల్యూఎస్	11	44
పెదపూడి	బీసీ	53	730
పెదపూడి	కాపు	24	40
పెదపూడి	ఈడబ్ల్యూఎస్	12	58
రంగంపేట	బీసీ	33	272
రంగంపేట	కాపు	41	182
రంగంపేట	ఈడబ్ల్యూఎస్	8	36
మొత్తం		376	2,461

అర్హులకే రుణాలు ఇవ్వాలి



ఎంతో ఆశతో సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అర్హతే ప్రామాణికంగా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి. రాజకీయ జోక్యం ఉండకూడదు. గత ప్రభుత్వంలో అర్హతే ప్రామాణకంగా పథకాలు మంజూరయ్యాయి. ఆ విధానాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగించాలి.

– బొడ్డు ముత్యాలరావు, బీసీ నాయకుడు, పందలపాక

చర్యలు తీసుకుంటున్నాం



సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాం. వీరిలో అర్హులకు రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బ్యాంకుల వారీగా సబ్సిడీ రుణాలు ఎవరికి ఎన్ని ఇవ్వాలో జిల్లా అధికారులు కేటాయించారు. దీని ప్రకారం అర్హులను ఎంపిక చేస్తాం.

– శ్రీనివాస్, ఎంపీడీవో, బిక్కవోలు

హరిదాసుకు రూ.15 వేల ఆర్థిక సాయం



హరిదాసు సూరిబాబుకు ఆర్థిక సాయం అందజేస్తున్న వెంకటరెడ్డి

పెదపూడి: జి.మామిడాడకు చెందిన తాళ్లూరి సూరిబాబు అనే హరిదాసుకు ఆ గ్రామానికి చెందిన ద్వారంపూడి అమ్మిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ద్వారంపూడి వెంకటరెడ్డి (చింతపండు) గురువారం రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ హరిదాసు సూరిబాబు గ్రామంలో చాలా కాలంగా ధనుర్మాసంలో కీర్తనలు పాడుతూ గ్రామానికి ఉపయోగకారిగా ఉండేవారన్నారు. ఆయన వెన్నెముకకు ఇటీవల గాయమైంది. దీంతో ఆయన మంచానికి పరిమితమయ్యారన్నారు. ఈ నేపథ్యంలో హరిదాసు స్వగ్రామమైన పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకా తిరుమల గ్రామానికి వెళ్లి ఆర్థిక సాయం అందించినట్లు వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పప్పు చిన్నారెడ్డి, నల్లమిల్లి భూలోకరెడ్డి, ద్వారంపూడి యువరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శిక్షణ



రంగంపేటలో యువకులకు శిక్షణ ఇస్తున్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు

రంగంపేట: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శత జయంతి ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా పెద్దాపురం ఖండ ప్రారంభిక శిక్షణ రంగంపేటలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు గురువారం జరిగిన ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బాల్యం నుంచి దేశభక్తిని పెంపొందించుకుని ఉత్తమ పౌరులుగా తయారు కావాలని పిలుపునిచ్చారు. ప్రధాన వక్తగా విచ్చేసిన విభాగ సంపర్క ప్రముఖ్ బులుసు జగదీష్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ హెగ్డేవార్ దేశభక్తిని, క్రమశిక్షణను, అంకిత భావాన్ని స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవకులుగా తయారు కావాలన్నారు. హైందవ సామ్రాజ్య స్థాపనకు కృషి చేసిన వీర శివాజీ దేశభక్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలోనూ ఆర్ఎస్ఎస్ శాఖలు ఏర్పాటు కావాలన్నారు. ఈ సందర్భంగా 70 మంది యువకులు మూడు రోజుల పాటు నేర్చుకున్న శిక్షణాంశాలను ప్రదర్శించారు. అంతకుముందు ధ్వజం, భరత మాత, డాక్టర్ జి.గురుజీ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమరసతా సేవా సమితి జిల్లా ప్రచారకులు ఎస్‌వీవీ సత్యనారాయణ, గ్రామ ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, మాజీ ఉప సర్పంచ్ పోతుల వీర సుందరరావు, మండల బీజేపీ అధ్యక్షుడు ఎం.సాయిరాం, ఉపాధ్యక్షుడు తోట సూర్యభాస్కరరావు, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి పేపకాయల సాయి రామచంద్రరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మండవిల్లి గుప్తా తదితరులు పాల్గొన్నారు.

లంకాలమ్మ జాతర ఉత్సవ కమిటీకి సన్మానం



సన్మానం అనంతరం కేక్ కట్ చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి, సర్పంచ్ రాంపండు, ఉత్సవ కమిటీ సభ్యులు

సీతానగరం: ఇనుగంటివారిపేటలో లంకాలమ్మ అమ్మవారి జాతర ఉత్సవ కమిటీ సభ్యులను గురువారం ఘనంగా సన్మానించారు. ఆ గ్రామ సర్పంచ్ సత్యం రాంపండు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పదకొండేళ్లకు ఒకసారి వచ్చే లంకాలమ్మ అమ్మవారి జాతరను ఈ నెల 15 నుంచి 25 వరకు గ్రామస్తుల సహాయ సహకారాలతో అత్యంత వైభవంగా జరిపారు. ఈ నేపథ్యంలో కమిటీ సభ్యులైన పెందుర్తి వెంకటేశ్వర్లు (స్మాల్), ముత్యాల గంగాధర్, బండారు పరశురామన్న, బంటపల్లి వెంకటపతి (బుజ్జి)లను జక్కంపూడి విజయలక్ష్మి చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. అనంతరం జక్కంపూడి విజయలక్ష్మిని జాతర ఉత్సవ కమిటీ, సర్పంచ్ రాంపండు సత్కరించారు. ఈ సందర్భంగా కేక్ కట్ సంబరాలు చేసుకున్నారు. జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామ దేవత లంకాలమ్మ అమ్మవారి జాతరను ప్రశాంత వాతావరణంలో ఉత్సవ కమిటీ నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామ దేవతల జాతరలు నిర్వహించడం వల్ల పల్లెలు పాడిపంటలతో సుభిక్షంగా ఉంటాయన్నారు. ప్రజలందరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యకర జీవనం



రాజానగరంలో యోగా సాధన చేస్తున్న ఉద్యోగులు



బిక్కవోలులో యోగా చేస్తున్న అధికారులు

రాజానగరం: యోగా సాధన ద్వారా మానసిక ఒత్తిడిని అధిగమించడంతో పాటు ఆరోగ్యవంతమైన జీవనాన్ని సాగించవచ్చని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, తహసీల్దార్ జీఏఎల్ఎస్ దేవి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి స్థానిక అన్నదాన సత్రం కల్యాణ మండపంలో యోగా ట్రైనర్ ఎంవీవీ రమణ పర్యవేక్షణలో గురువారం ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. సూపరింటిండెంట్ సుబ్రహ్మణ్యం, వైద్యాధికారి డాక్టర్ రామభాస్కరరావు మాట్లాడుతూ యోగా చేయడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు.

యోగాతో ఆరోగ్య సంరక్షణ

కోరుకొండ: యోగాతో ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని తహసీల్దార్ సుస్వాగతం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో పాటు, స్థానికులు యోగాసనాలు వేశారు. సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, ఆర్‌బి రెడ్డి, స్థానిక నాయకులు కర్రి గణేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

బిక్కవోలు: నిరంతర యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్య పొందవచ్చని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం యోగాసనాలు వేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం అధికారులందరూ కలిసి యోగా చేశారు. కార్యక్రమంలోని తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ, పీహెచ్‌సీ వైద్యులు దుర్గాదేవి పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల తనిఖీ



రేషన్ షాపును పరిశీలిస్తున్న తహసీల్దార్ సీతాపతిరావు

పెదపూడి: మండలంలో 42 రేషన్ షాపులను తహసీల్దార్ పీవీ సీతాపతిరావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ ఒకటి నుంచి రేషన్ షాపుల్లో కార్డుదారులకు సరకులు పంపిణీ చేయనున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రేషన్ షాపులను పరిశీలించామన్నారు. షాపుల వద్ద ఈ పాస్‌మెషీన్లు, వేయింగ్ మెషీన్ల పనితీరు, షాపుల లైసెన్స్ వ్యాలిడిటీ, స్టాక్ రూమ్‌లు పరిశీలించినట్టు తెలిపారు. షాపుల వద్ద సరకులు, వాటి ధరలను తెలిపే బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ కృషితో వ్యవసాయం లాభదాయకం



ఎమ్మెల్యే బలరామకృష్ణను సత్కరిస్తున్న అధికారులు

కోరుకొండ: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌తో వ్యవసాయం లాభదాయకంగా మారుతుందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధనా సంస్థ, కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కోరుకొండ ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన వెబ్‌కాస్ట్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మే 29 నుంచి జూన్ 12 వరకూ 15 రోజుల పాటు శాస్త్రవేత్తలు రైతుల వద్దకు వెళ్లి సాగు విధానంలో సరికొత్త మార్పులు తీసుకురావడానికి కృషి చేస్తారన్నారు. కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ ఒడిశాలోని పూరి నుంచి కేంద్రవ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. దేశంలోని 700 జిల్లా ల్లో 2,000 శాస్త్రీయ బృందాల సభ్యులు 1.5 కోట్ల మంది రైతుల వద్దకు వెళతారన్నారు. కార్యక్రమంలో సస్యరక్షణాధికారి రఘునందన్, పశుసంవర్ధక అధికారి డాక్టర్ నాగేశ్వరరెడ్డి, మత్స్యశాఖ అధికారి డాక్టర్ రవీంద్ర, జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధనా సంస్థ డివిజనల్ అధిపతులు డాక్టర్ ఎల్‌కే ప్రసాద్, డాక్టర్ సరళ, డాక్టర్ రాజశేఖర్, వ్యవసాయశాఖ అధికారులు మాధవరావు, మల్లికార్జునరావు, ఉద్యానవనశాఖ అధికారి సుజాత కుమారి పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి నుంచి ఉపశమనం



యోగాంధ్రలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న జేసీ చిన్నరాముడు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: యోగాతో ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుందని జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు అన్నారు. యోగాంధ్ర ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆర్ట్స్ కళాశాల మైదానం సమీపంలోని గ్రాండ్ ట్రంకు రోడ్డుపై గురువారం ప్రాధాన్యత రంగం శాఖల ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ రైతులు, నగర ప్రజలు, మహిళలతో యోగా సాధన చేయించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగిందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు, యోగా గురువు శివకుమార్ ఆధ్వర్యంలో సూక్ష్మ వ్యాయామం, తాడాసనం, వృక్షాసనం, పాదహస్తాసనం, అర్ధ చక్రాసనం, త్రికోణాసనం వంటి వివిధ ఆసనాలతో పాటు యోగా ప్రక్రియలను సాధన చేయించారు. అనంతరం బ్రహ్మకుమారి సోదరి బీకే శ్రావణి రాజయోగ ధ్యానం (మెడిటేషన్) చేయించారు. జూన్ ఒకటిన సరస్వతీ ఘాట్, 7న సత్యదేవ నర్సరీ, 14న కొవ్వూరు గోష్పాద క్షేత్రం, 20న నగరవనం తదితర పర్యాటక ప్రదేశాల్లో యోగా అభ్యాస సాధన జరుగుతుందన్నారు. అనంతరం వై.జంక్షన్ వరకూ ర్యాలీగా వెళ్లి, అక్కడ రైతులు, అధికారులు మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీతారామమూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిరంతర నిఘా..

- ప్రభుత్వాస్పత్రిలో 60 సీసీ కెమెరాలు
- స్వయంగా పర్యవేక్షిస్తున్న సూపరింటెండెంట్
- త్వరలో మరిన్ని ఏర్పాటుకు చర్యలు



ప్రభుత్వాసుపత్రిలో సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యప్రభ

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మరింత కట్టుదిట్టమైన భద్రతా పర్యవేక్షణలో కొనసాగుతోంది. ఇప్పటికే ఆసుపత్రి అంతా సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంది. గతంలో సీసీ కెమెరాల నిఘా ఉన్నా అవి అంతంత మాత్రంగా ఉండేవి. అంతేకాక వాటిని అవసరం లేని ప్రాంతాల్లో వృథాగా ఏర్పాటు చేశారు. పేరుకు మాత్రం సీసీ కెమెరాలున్నా వాటి లక్ష్యం మాత్రం సున్నాగా ఉండేది. ఈ విధంగా ఆసుపత్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా పలుమార్లు వైద్య సామగ్రి దొంగతనాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఆసుపత్రిలో నిత్యం అధిక సంఖ్యలో వైద్యులు, నర్సులు, వైద్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తుంటారు. వారు సమయానికి విధులకు హాజరైనా తర్వాత వారు ఏం చేస్తున్నారు, రోగులతో ఏ విధంగా ప్రవర్తిస్తున్నారు అనే విషయాలు తెలుసుకునే వీలుఉన్నా ఆ పని అంతంత మాత్రంగానే జరిగేది. దీంతో తమ ఇష్టారాజ్యంగా కొందరు సిబ్బంది ప్రవర్తించేవారు.

60 సీసీ కెమెరాలు

ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రిలో 60 సీసీ కెమెరాలు నిత్యం పనిచేస్తున్నాయి. వీటిలో ప్రధాన ఆసుపత్రిలో 46, మాతా శిశు విభాగంలో 24 కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటి మానటరింగ్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యప్రభ తన గదిలోంచే పర్యవేక్షిస్తున్నారు. ఆసుపత్రిలో వైద్యుల నుంచి వైద్య సిబ్బంది, నర్సుల పనితీరును నిత్యం పరిశీలిస్తున్నారు. దీంతో పనివేళల్లో ఆసుపత్రిలో అన్ని విభాగాల సిబ్బంది అప్రమత్తతతో ఉంటున్నారు. సూపరింటెండెంట్ సీసీ కెమెరాల్లో చూస్తున్నారు అనే భయంతో సిబ్బంది రోగులతో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఆసుపత్రిలో రోగులు అధికంగా వచ్చే జనరల్ వార్డు విభాగం, ఆర్థో విభాగం, ఆర్ఎంవో గది ప్రాంతం, ఆసుపత్రిలోని పైఅంతస్తుల్లోని పలు రద్దీగా ఉండే విభాగాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మరికొన్నింటిని త్వరలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

నిత్యం పర్యవేక్షణ

ఆసుపత్రిలో సీసీ కెమెరాలను నా గది నుంచే నేరుగా పర్యవేక్షిస్తాను. ఆసుపత్రి రద్దీగా ఉండే ఉదయం సమయంలో వీటిపై అధికంగా దృష్టి పెడతాను. ఆసుపత్రిలో రోగులు రద్దీ, ఓపీ చూస్తున్న డాక్టర్లపై పర్యవేక్షణ ఉంటుంది. ఒక్కోసారి వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తించడం కూడా కనిపిస్తుంది. వెంటనే సంబంధిత వ్యక్తులను పిలిచి మెమోలు ఇచ్చిన సందర్భాలు చాలా ఉన్నాయి. అలాగే ఎవరైనా రోగుల వద్ద డబ్బులు వంటివి డిమాండ్ చేస్తున్నారా అనే విషయాల్ని గమనిస్తున్నాం. ఎక్కడైనా అటువంటివి జరిగితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం. సీసీ కెమెరాల పర్యవేక్షణతో వైద్య సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉంటున్నారు.

– డాక్టర్ సూర్యప్రభ, సూపరింటెండెంట్